క్లుప్తంగా

ఎంపీ మాగుంటను కలిసిన మంత్రి ఆదిమూలపు



ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని శనివారం స్థానిక ఆయన కార్యాలయంలో మంత్రి ఆదిమూలపు సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంతో పాటు ఆర్.ఎల్.పురం, ఇండస్ట్రియల్ ఏరియాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చీమకుర్తి ఏడీఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి, నార్త్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో పీఎంఐ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నూతన విధానంలో బోధించాలి

నాగులుప్పలపాడు (మద్దిపాడు): సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకుని విద్యార్థులకు నూతన విద్యా విధానంలో పాఠాలు బోధించాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమలశెట్టి రవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ, బైజూస్ యాప్‌లపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్లుగా నాయుడు శ్రీనివాసులు, చుండూరి రఘుబాబు వ్యవహరించగా స్థానిక ప్రధానోపాధ్యాయులు, మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పుస్తకాల గోడౌన్లో అగ్ని ప్రమాదం

ఒంగోలు టౌన్: ప్రభుత్వ పాఠశాల పుస్తకాల గోడౌన్లో అగ్నిప్రమాదం సంభవించింది. నగర శివారులోని త్రోవగుంట వద్ద గల ప్రభుత్వ పాఠశాల పుస్తకాల గోడౌన్లో శనివారం మధ్యాహ్నం సిబ్బంది భోజనానికి వెళ్లిన సమయంలో పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే మేనేజర్ యలమంద వెంకట శివాజీకి సమాచారమిచ్చారు. గోడౌన్ వద్దకు చేరుకున్న ఆయన.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సహాయంతో మంటలను ఆర్పేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో పాత పుస్తకాలు కాలిపోయాయి. వాటి విలువ రూ.60 వేల వరకు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. సమాచారం తెలుసుకున్న డీఈవో సుబ్బారావు, తదితరులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జిల్లాలోని 56 మండలాల ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడి నుంచే పుస్తకాలు సరఫరా చేస్తారు. ఈ ఏడాది పుస్తకాల పంపిణీ జరిగిపోవడంతో కొత్త పుస్తకాలు లేవు. దీంతో భారీ నష్టం తప్పింది.

భావితరాల భవిష్యత్తు కోసం తెలగతోటి కృషి

ఒంగోలు టౌన్: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలిగా ఎన్నికైన తెలగతోటి సుమతి భావితరాల భవిష్యత్తు కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం ప్రతిఒక్కరిలో ఉందని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో తెలగతోటి సుమతికి శనివారం అభినందన సభ నిర్వహించారు. సమాజ సేవ కోసం తన జీవితాన్ని సుమతి అంకితం చేయడం అభినందనీయమని ముఖ్య అతిథిగా హాజరైన హర్షప్రీతం అన్నారు. యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా తనకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నెరవేరుస్తారన్నారు. జిల్లా ఎంఈఓల సంఘ అధ్యక్షుడు బత్తుల నాగేంద్ర వదన్, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకుడు పర్రి వెంకటరావు, నీలం వెంకటరావు, నత్త, సత్యకుమారి ప్రసంగించారు.

చిన్నారులకు నేడు పెయింటింగ్ పోటీలు

ఒంగోలు సబర్బన్: అక్టోబర్ 1న బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ఒంగోలు నగరంలో ఆదివారం స్కెచ్/పెయింటింగ్ పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ షేక్ అజీర్ తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనేందుకు ఐదు నుంచి 10 సంవత్సరాల్లోపు చిన్నారులు అర్హులని వివరించారు. నగరంలోని కర్నూలు రోడ్డులో శ్రీనగర్ కాలనీ ఒకటో లైన్‌లో ఉన్న జూపిటర్ హైస్కూలులో, లాయర్‌పేట షిర్డీ సాయిబాబా ఆలయం పక్క లైన్‌లో ఉన్న ఫ్రీడం బర్డ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలల హెచ్‌ఎంలు చిన్నారులను పోటీల్లో ప్రోత్సహించాలని కోరారు.

బై..బై.. గణేషా..!

- కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం



ఒంగోలు బండ్లమిట్టలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బలరాం కాలనీలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: కొత్తపట్నం సముద్రతీరంలో కోలాహలంగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణపయ్య విగ్రహాలలో 113 విగ్రహాలను శనివారం ఆరో రోజు సముద్ర తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఊరేగింపుగా విగ్రహాలను తీరానికి తీసుకొచ్చి పూజలు చేశారు. టెంకాయలు కొట్టి దండకం చదివి సముద్రంలో నిమజ్జనం చేశారు. మండలంలోని ఈతముక్కల, మడనూరు, కొత్తపట్నం బీచ్‌లలో మొత్తం 113 విగ్రహాలను ఒకేరోజు నిమజ్జనం చేశారు. కొద్దిసేపు వర్షం పడటంతో నిమజ్జనాలకు ఆటంకం కలిగింది. వర్షం తగ్గిన తర్వాత మళ్లీ నిమజ్జనాలను ప్రారంభించారు. సివిల్ పోలీసులు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై బి.సాంబశివరావు పర్యవేక్షించారు.

ఒంగోలులో గణపయ్య పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని...

ఒంగోలు: నగరంలోని బలరాం కాలనీలో శ్రీకాంత్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి నిర్వహించిన పూజల్లో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొని పూజలు చేశారు. స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస థియేటర్ వద్ద నుంచి బలరాం కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహిళలు బాలినేనికి గుమ్మడికాయతో దిష్టి తీసి హారతులిచ్చి స్వాగతం పలికారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ యరజర్ల వద్ద ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకోలేదని వినాయకుని సాక్షిగా ప్రమాణం చేయగలడా అని బాలినేని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ గందు ధనలక్ష్మి మధు స్థానిక నాయకులు బాలినేనిని ఘనంగా సత్కరించారు.

చీమకుర్తి రెడ్డిబజార్‌లో రూ.43,500 పలికిన వినాయకుడి లడ్డు...

చీమకుర్తి: చీమకుర్తిలోని రెడ్డిబజార్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం చేతిలో ఉంచిన లడ్డుకు శనివారం వేలంపాట నిర్వహించగా, స్థానికుడైన సునీల్‌కుమార్‌రెడ్డి రూ.43,500కు పాడుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి లడ్డును ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం విగ్రహాన్ని కోలాహలంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.



కొత్తపట్నం తీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న వెంగముక్కలపాలెం భక్తులు



నిమజ్జనం చేసే ముందుగా గణపయ్యకు పూజలు చేస్తున్న భక్తులు



చీమకుర్తిలో రూ.43,500కు వినాయకుడి లడ్డు దక్కించుకున్న సునీల్‌కుమార్‌రెడ్డి

శిద్దా సుధీర్‌ను సత్కరించిన జిల్లా రిజిస్ట్రార్



శిద్దా సుధీర్‌ను సత్కరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్‌ను శనివారం ఆయన కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు, సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖుడు చుండూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం ర్యాగింగ్ శిక్షార్హం

- రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి సోమశేఖర్



మాట్లాడుతున్న 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి సోమశేఖర్

ఒంగోలు: ర్యాగింగ్ చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరమని, ర్యాగింగ్ జోలికి విద్యార్థులు వెళ్లవద్దని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ అన్నారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేసిన లేదా సహకరించిన, భౌతికంగా , శారీరకంగా వేధించినా భవిష్యత్‌లో విద్యార్థులు చట్టపరంగా చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులలో మానసిక ధైర్యం దెబ్బతింటుందని, ఆత్మహత్యల దిశగా కూడా ఆలోచన చేస్తారన్నారు. ర్యాగింగ్‌కు చట్ట వ్యతిరేకంగా విద్యార్థులంతా ప్రతిన బూనాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ యొక్క విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. రైజ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ కాలేజీలో తగిన జాగ్రత్తలు తీసుకొని ర్యాగింగ్‌ని పూర్తిగా నిషేధించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మేకల రామమూర్తి, సుంకర సాయిబాబు, ప్రభుత్వ వైద్యులు సాగర్, కళాశాల సిబ్బంది వెంకటరెడ్డి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ఏర్పాటు



ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను ఏర్పాటు చేసిన సభ్యులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫార్మా కాలేజీ డిపార్ట్‌మెంట్‌లో ఏపీపీఎస్‌సీటీఎన్-2022 వారి సహకారంతో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను ఏపీపీఎస్ అధ్యక్షుడు డాక్టర్ శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ బోర్డు వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నూతన విద్యా పరికరాలతో విద్యా బోధన చేస్తూ అంతర్జాతీయంగా ఎదగాలని అందుకు అవసరమైతే దాతల ద్వారా అవసరాలను సమకూర్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. దీనిలో కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, పూర్వపు ప్రిన్సిపాల్ సాల్మాన్ రాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, హెచ్‌ఓడీ చంద్రకళ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చీమకుర్తి బస్టాండ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ శానిటరీ సిబ్బంది

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలో ఇళ్ల చుట్టూ, వీధుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛత హై కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని శానిటరీ వర్కర్లు, సిబ్బందితో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తి బస్టాండ్‌లో ర్యాలీ నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా అందించడంలో ప్రజలు చైతన్యవంతులుగా ఉండి శానిటరీ సిబ్బందికి సహకరించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. చీమకుర్తి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ఒంగోలు సెంట్రల్: ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ డాక్టర్స్ సెల్, యువమోర్చా నేతృత్వంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రిమ్స్ బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి రామకృష్ణారావు, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, రాష్ట్ర నాయకులు, పొగాకు బోర్డు మెంబర్ బోడపాటి బ్రహ్మయ్య, ఏకే విద్యాసంస్థ పాలకమండలి సభ్యులు, యువ మోర్చా నాయకులు, మైనార్టీ మోర్చా, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు. అనంతరం మోదీ 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని 73 మొక్కలను లా కళాశాల ప్రాంగణంలో నాటారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన సుధీర్



అనిల్



తేజ

నాగులుప్పలపాడు: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వలంటీర్‌తో పాటు మరో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. శనివారం రాత్రి కేశినేనివారిపాలెం గ్రామానికి చెందిన చదలవాడలో వలంటీర్‌గా పనిచేస్తున్న సుధీర్.. మద్దిపాడు మండలం ఎంపీసీ నగర్‌కు చెందిన అనిల్‌తో కలిసి బైకుపై ఒంగోలు వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో మద్దిరాలపాడు-చదలవాడ గ్రామాల మధ్య గుండ్లకమ్మ చప్టాపైకి రాగానే ఉప్పుగుండూరు నుంచి ఒంగోలు వెళ్తున్న సామినేని తేజ వాహనం ఢీకొనడంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై హరిబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముగ్గురినీ ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

యువతి పెళ్లి ఖర్చులకు ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: స్థానిక గోపాల్‌నగర్‌కు చెందిన షేక్ ముబిన పెళ్లి ఖర్చుల కోసం సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం ట్రస్టు కార్యాలయంలో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని యువతి తల్లి షర్మిలకు అందజేశారు. ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు మార్కాపురం విద్యార్థిని



ప్రాజెక్టు నమూనాను వివరిస్తున్న విద్యార్థినులు



సెమినార్‌కు ఎంపికైన వై. వీటి చంద్రిక

ఒంగోలు: జాతీయ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం , బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం వారు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్ సెమినార్‌లో భాగంగా స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వైవీటి చంద్రిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మిల్లెట్స్ ఈజ్ ఎ సూపర్ ఫుడ్ ఆర్ డైట్ ఫుడ్ అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించారు. మంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.సాత్విక్ ద్వితీయ బహుమతిని, జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.మహాల తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన చంద్రికను, ఇతర విజేతలను జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు అభినందించారు. విజేతలకు ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్ అభినందించారు. సెమినార్‌కు జ్యూరీ సభ్యులుగా భిక్షాలరెడ్డి (హెచ్‌ఎం), జగన్నాథ్‌రావు (పీజీటీ)తో పాటు జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సంతనూతలపాడు తహసీల్దార్



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

చీమకుర్తి: సంతనూతలపాడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చీమకుర్తి తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సంతనూతలపాడులో తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్ఎల్ నారాయణరెడ్డిని ఇటీవల కార్యాలయంలో జరిగిన వివాదాల నేపథ్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో చీమకుర్తి తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గతంలో సంతనూతలపాడు మండలానికి ఒకసారి రెగ్యులర్ తహసీల్దార్‌గా, మరోసారి ఇన్‌చార్జిగా కూడా మధుసూదన్‌రావు బాధ్యతలు నిర్వర్తించారు. మధుసూదన్‌రావును వీఆర్‌ఓలు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

ఒంగోలు టౌన్: తన భార్యతో మాట్లాడుతున్నాడని ఓ యువకుడిపై ఒక వ్యక్తి దాడి చేసి గాయపరిచిన ఘటన ఒంగోలు నగరంలో శనివారం జరిగింది. పొదిలి మండలం బుచ్చనపాలెం గ్రామానికి చెందిన గురిజల నవీన్ ఒంగోలులో కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. కొంతకాలం క్రితం రాజాపానగల్ రోడ్డుకు చెందిన ఒక యువతితో అతనికి పరిచయమైంది. ఆమెతో మాట్లాడుతుండటంతో ఆమె భర్త శివ కొద్దిరోజుల క్రితం నవీన్‌తో గొడవపడ్డాడు. దీంతో ఆ యువతితో మాట్లాడటాన్ని నవీన్ మానేశాడు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం అంజయ్య రోడ్డులో కారులో వెళుతున్న నవీన్‌ను స్కూటీపై వచ్చిన శివ అడ్డుకుని కులం పేరుతో బూతులు తిట్టి దాడి చేసి గాయపరిచాడు. చంపుతానని బెదిరించాడు. తనకు శివ వలన ప్రాణహాని ఉందని నవీన్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యాపకునికి డాక్టరేట్

ఒంగోలు: స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న మర్రి జాలయ్య ఎవాల్యుయేషన్ ఆఫ్ ప్రొటెక్టివ్ పొటెన్షియల్ ఆఫ్ క్రిల్ ఆయిల్ అండ్ ఫిష్ ఆయిల్ ఇన్ డాక్సో రుబిసిన్ ఇండ్యూస్డ్ కెమో బ్రెయిన్ ఇన్ రాట్స్ అనే అంశంపై అపెక్స్ అనే రాజస్థాన్‌కు చెందిన యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఫిష్ ఆయిల్, క్రిల్ ఆయిల్ తీసుకోవడం వల్ల కిమోథెరపీ వల్ల వచ్చే దుష్ప్రభావాలను అరికట్టవచ్చనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ సందర్భంగా శనివారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో జాలయ్యను క్విస్ కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రి, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి తదితరులు అభినందించారు.

రాష్ట్ర విభజన సమయంలోనే జిల్లాకు అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



పాదయాత్ర ముగింపు సభలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: రాష్ట్ర విభజన సమయంలోనే ప్రకాశం జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించేలా పాలకులను ఒప్పించకుండా స్థానిక నాయకులు స్వార్థ ప్రయోజనాలతో వ్యవహరించారని గుర్తు చేశారు. నాడు జిల్లాను వెనకబడిన జిల్లాగా ప్రకటించాలని పట్టుబట్టి ఉంటే నేడు ఈ దుస్థితి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా టీడీపీ తప్పు చేస్తోందన్నారు. ప్రజల సమస్యలపై చర్చించడానికే ప్రజలు ఓటు వేశారన్న వాస్తవాన్ని నాయకులు మరిచిపోవడం తగదన్నారు. చంద్రబాబు కేసు న్యాయస్థానం పరిధిలో ఉందని, దానిపై మాట్లాడనని అన్నారు. లోకేష్‌ను అరెస్టు చేస్తారో లేదో చెప్పలేమన్నారు. జమిలీ ఎన్నికలను ఎవరు కోరారని ఆయన ప్రశ్నించారు. మోదీ పాలనపై మండిపడ్డారు. ఢిల్లీలో నాయకుల చుట్టూ తిరుగుతున్న లోకేష్‌కు సిగ్గులేదా అని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాలో 14 రోజుల్లో 320 కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు పాదయాత్ర బృంద నాయకుడు జీవీ కొండారెడ్డి తెలిపారు. పశ్చిమ ప్రకాశం జిల్లాలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సభలో పూనాటి ఆంజనేయులు, వై.సిద్ధయ్య, ఎస్‌కే మాబు, కంకణాల రమాదేవి, కంకణాల ఆంజనేయులు, పి.కల్పన, ఎండీ రఫీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్య-విద్యా రుణాలపై అవగాహన సదస్సు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు విదేశాలలో ఉన్నత చదువులు- విద్యారుణాలు అనే అంశంపై స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్ బాలాంజనేయులు శనివారం అవగాహన కల్పించారు. పలు విషయాలను వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డీపీఓను పరామర్శించిన ఎంపీ మాగుంట



డీపీఓ నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు అర్బన్: అస్వస్థతతో స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చేరిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నారాయణ రెడ్డిని శనివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

మార్కాపురం వాసికి రూ.2 లక్షల అందజేత

- సీఎం సహాయనిధి చెక్కు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్



శ్రీనివాసులుకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మార్కాపురానికి చెందిన మిరియంపల్లి శ్రీనివాసులుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థికసాయం చెక్కును శనివారం కలెక్టర్ దినేష్‌కుమార్ స్థానిక ప్రకాశం భవనంలో అందించారు. శ్రీనివాసులుకు ఇద్దరు సంతానం కాగా, ఇద్దరూ అంగవైకల్యం బారిన పడ్డారు. గత ఏప్రిల్‌లో వైఎస్సార్ బీమా నేస్తం పథకం రెండో విడత కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన కుటుంబ పరిస్థితిని శ్రీనివాసులు వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి.. కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. దీంతో కలెక్టరేట్ నుంచి ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు. వెంటనే రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేశారు. ఆ చెక్కును బాధిత కుటుంబానికి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యపటేల్, డీఆర్‌ఓ శ్రీలత, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.